డెకాయ్ ఆపరేషన్లతో పోకిరీల భరతం

- 15 రోజుల్లో 76 మందిని పట్టుకున్న షీటీమ్స్
- పలువురిపై క్రిమినల్ కేసులు నమోదు

హైదరాబాద్ సిటీ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాచకొండ షీటీమ్స్ సిబ్బంది మహిళలను వేధిస్తున్న పోకిరీల భరతం పడుతున్నారు. గడిచిన 15 రోజుల్లో 76మందిని అదుపులోకి తీసుకున్న షీటీమ్స్ వారిపై కేసులు నమోదు చేశారు. వారిలో 20మంది మైనర్లు కూడా ఉండటం గమనార్హం. బహిరంగ ప్రదేశాల్లో ప్రేమపేరుతో యువతుల వెంటపడుతూ, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న వారిని డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించి అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిని శుక్రవారం ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంప్ కార్యాలయంలో తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించామని ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ టి ఉషా విశ్వనాథ్ తెలిపారు. మే 1 నుంచి 15 వరకు 101 ఫిర్యాదులు అందాయని వాటిపై విచారణ జరిపి 76మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారిలో లైంగిక వేధింపులకు పాల్పడిన 11 మందిపై క్రిమినల్ కేసులు, 47మందిపై పెట్టీ కేసులు నమోదు చేశామని, మిగతా వారికి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించామని తెలిపారు. స్నానం చేస్తుండగా వీడియో తీసి, లైంగిక వేధింపులకు పాల్పడడంతోపాటు డబ్బు డిమాండ్ చేసిన యువకుడిపై, ప్రేమపేరుతో యువతిని మోసం చేసిన యువకుడిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపామన్నారు. అంతే కాకుండా మే 1 నుంచి 15 వరకు రాచకొండ షీటీమ్స్ ఆధ్వర్యంలో 30 ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, దాదాపు 4,425 మందికి మహిళా చట్టాలు, హక్కులు, నేరాల గురించి ఫిర్యాదు చేయడం వంటి అంశాలపై అవగాహన కల్పించామన్నారు.


రాచకొండ సీపీ తరుణ్ జోషి

నిర్భయంగా ఫిర్యాదు చేయండి

- సీపీ తరుణ్ జోషి

మహిళల భద్రతకు పెద్దపీట వేస్తున్నాం. బాలికలను, మహిళలను వేధించే వారిని ఎట్టి పరిస్థితుల్లో విడిచిపెట్టే ప్రసక్తి లేదు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచి, విచారణ జరుపుతాం కాబట్టి, ఎవరైనా వేధింపులకు పాల్పడితే వెంటనే నిర్భయంగా ఫిర్యాదు చేయండి. బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్, మెట్రోస్టేషన్, స్కూల్, కాలేజీ, మార్కెట్ వంటి బహిరంగ ప్రదేశాల్లో షీటీమ్స్ మఫ్టీలో తిరుగుతూ డెకాయ్ ఆపరేషన్‌లు నిర్వహిస్తున్నాయి. స్వయంగా ఫిర్యాదు చేయడానికి రాలేని వారు ఆన్‌లైన్‌లో కూడా ఫిర్యాదు చేయవచ్చు.


గంజాయితో పట్టుబడ్డ యువకుడితో ఎక్సైజ్ పోలీసులు

గంజాయి విక్రేత అరెస్ట్

ఎల్‌బీనగర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని సరూర్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎల్బీనగర్‌లో గస్తీ నిర్వహిస్తున్న ఎక్సైజ్ పోలీసులు అనుమానాస్పదంగా తిరుగుతున్న ప్రేమ్‌కుమార్ అనే వ్యక్తిని శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. అతన్ని విచారించగా భద్రాచలం నుంచి గంజాయిని కొనుగోలు చేసి సరూర్‌నగర్, బాలాపూర్ ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్నట్లు వెల్లడించాడు. అతని వద్ద 1.4కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ గస్తీలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐలు ఫయాజ్, కృష్ణయ్యగౌడ్, కానిస్టేబుల్లు రవి, వెంకట్, నర్సింహారావు పాల్గొన్నారు. గంజాయి, మత్తు పదార్థాల విక్రయదారుల సమాచారం 8712658746 మొబైల్ నెంబర్‌కు ఇవ్వాలని ఆయన కోరారు.


బూస్టర్ పంప్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలాల, కార్పొరేటర్ మినాజుద్దీన్

తాగునీటి సరఫరా మెరుగుకు చర్యలు : బలాల

సైదాబాద్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో మెరుగైన తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. శుక్రవారం అక్బర్‌బాగ్ డివిజన్ పల్టన్‌లో రూ.7.18 లక్షలతో నిర్మించిన బూస్టర్ పంప్‌ను కార్పొరేటర్ మినాజుద్దీన్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. నీటి ఇబ్బందులు తలెత్తకుండా పాతలైన్ల స్థానంలో కొత్త పైప్‌లైన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం షీలారాణి, స్థానిక నేతలు పాల్గొన్నారు.


రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

రోడ్డు పనులు నాణ్యతతో చేపట్టాలి: సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వనస్థలిపురం డివిజన్ గుంటి జంగయ్యకాలనీలో నూతనంగా నిర్మించే సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే అధికారులచే కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొన్ని నెలల క్రితమే ఇక్కడ డ్రైనేజీ పనులు పూర్తిచేయడం జరిగిందన్నారు. నూతనంగా వేసే సీసీ రోడ్డు పనుల్లో భాగంగా ఎత్తుపల్లాలు సరిగ్గా చూసుకుని పనులు ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, ఏఈ ప్రజ్ఞ, రఫీ, కాలనీవాసులు పాల్గొన్నారు.


ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న జంగారెడ్డి తదితరులు

ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి సన్మానం

చంపాపేట, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుపొందిన భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని శుక్రవారం కాంగ్రెస్ చంపాపేట డివిజన్ సీనియర్ నాయకుడు, కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ మాజీ డైరెక్టర్ బసిగూడెం జంగారెడ్డి పార్టీ కార్యాలయంలో ఎంపీని గజమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో ఎంపీ మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ యువ నాయకుడు బసిగూడెం సోమనాథ్‌రెడ్డి, నాయకులు యాదగిరి, జంగయ్యగౌడ్, గోపాల్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి

నూతన న్యాయమూర్తుల పరిచయ కార్యక్రమం

రంగారెడ్డి జిల్లా కోర్టులు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కోర్టులకు ఇటీవల బదిలీపై వచ్చిన న్యాయమూర్తుల పరిచయ కార్యక్రమం శుక్రవారం జిల్లా కోర్టుల సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ పరస్పర సహకారంతో కేసులను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. బదిలీపై వచ్చిన న్యాయమూర్తులు కవిత, తిరుమల గోపి, రాజ్‌కుమార్, సత్యం, గౌరీలను మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి పట్టాభిరామారావు పరిచయం చేశారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, కార్యదర్శి మాధవరెడ్డిలతో పాటు పలువురు జడ్జిలు, న్యాయవాదులు పాల్గొన్నారు.


క్రీడాకారులకు టీ షర్టులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలి

వనస్థలిపురం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువకులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకుని శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం మన్సూరాబాద్‌లోని పెద్దచెరువు ప్రాంగణంలో కార్పొరేటర్ ఆధ్వర్యంలో వాలీబాల్ క్రీడాకారులకు మౌలానా బాబా చేతులమీదుగా టీ షర్టులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్లు, ఇతర చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా కొంత సమయాన్ని క్రీడలకు కేటాయించాలన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. ఇన్‌స్పెక్టర్ జలంధర్‌రెడ్డి, నాయకులు రామేశ్వర్, వేమన్‌రెడ్డి, కవిత, యాదయ్య పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా రవికిరణ్

హయత్‌నగర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌కు చెందిన పానుగుపాటి రవికిరణ్‌ను బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధికార ప్రతినిధిగా నియమిస్తూ అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రవికిరణ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా అధికార ప్రతినిధిగా నియమించినందుకు ఆయన పార్టీ ముఖ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు.


నియామక పత్రాన్ని అందుకుంటున్న రవికిరణ్

టెన్నిస్ రన్నరప్‌గా సంజన

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆలిండియా టెన్నిస్ అసోసియేషన్ నిర్వహించిన జాతీయ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ అమ్మాయి సంజన సిరిమల్ల ఫైనల్లో ఓడి, రన్నరప్‌గా నిలిచింది. శుక్రవారం శామీర్‌పేట్‌లోని యాష్ టెన్నిస్ అకాడమీలో జరిగిన ఫైనల్లో సంజన 3-6, 1-6తో సొనాల్ (మహారాష్ట్ర) చేతిలో ఓడింది. అంతకుముందు జరిగిన సెమీస్‌లో సంజన 6-2, 6-1తో శైలీ టక్కర్‌పై గెలిచి, ఫైనల్‌లో ప్రవేశించింది.

బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

చంపాపేట, జూన్ 7(ఆంధ్రజ్యోతి): బడిఈడు పిల్లలందరిని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలని ప్రధానోపాధ్యాయుడు మంచిరెడ్డి అనంతరెడ్డి అన్నారు. చంపాపేటలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మంచిరెడ్డి అనంతరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కటికోనికుంటలో ప్రొ:జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కరపత్రాలు పంచుతూ పిల్లలను పాఠశాలలో చేర్పించాలని వారి తల్లిదండ్రులను కోరారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాలలో యూకేజీ నుంచి 5వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో బోధన ఉంటుందని, నాణ్యమైన విద్యతో పాటు డిజిటల్ క్లాస్‌రూమ్ బోధన ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫామ్స్, ఉదయం టిఫిన్‌తో పాటు మధ్యాహ్న భోజనం, వారంలో మూడుసార్లు గుడ్లు అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్కులు, ఉచిత బస్‌పాస్ సౌకర్యం, ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలలో శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏపీసీ చైర్మన్ పోల్‌దాస్ చంద్రమ్మ, భాగ్యలక్ష్మి, టీచర్లు లక్ష్మి, సుదేష్ణ, అజిత, వెంకటదేవి, జ్యోతి, రజిత, రాంరెడ్డి, ఎన్.కావ్య పాల్గొన్నారు.


కటికోనికుంటలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో కరపత్రాలు పంచుతున్న హెచ్‌ఎం మంచిరెడ్డి అనంతరెడ్డి, ఉపాధ్యాయులు


అబ్దుల్లాపూర్‌మెట్ జడ్పీహెచ్‌ఎస్ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

అబ్దుల్లాపూర్‌మెట్‌లో బడిబాట ప్రారంభం

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని శుక్రవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ రేఖ, జడ్పీటీసీ బింగి దేవదాసుగౌడ్, వైస్ ఎంపీపీ కొలన్ శ్రీధర్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీవాణి, ఎంఈవో వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి.. విద్యార్థుల తల్లిదండ్రులను కలిశారు. బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా బడిబాట కార్యక్రమం కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యాబోధన ఉంటుందని ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భాస్కర్‌గౌడ్, కో-ఆప్షన్ సభ్యుడు గౌస్‌పాషా, ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


జాతీయ రహదారి రామోజీఫిల్మ్ సిటీ ప్రధాన గేటు ఎదుట నిలిచిన వర్షపు నీటితో ఇబ్బంది పడుతున్న వాహనదారులు

జాతీయ రహదారిపై నిలుస్తోన్న వర్షపు నీరు

- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): నగర శివారు అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద విజయవాడ జాతీయ రహదారిపై రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రధాన గేటు ఎదుట వర్షపు నీరు నిలుస్తోంది. దీంతో వర్షం కురిసిన ప్రతిసారి జాతీయ రహదారిపై వాహనదారులు తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. కొంత కాలంగా జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్న సంగతి తెలిసిందే. కాగా ఫిల్మ్‌సిటీ ప్రధాన గేటు ముందున్న యూటర్న్ వద్ద రోడ్డు డౌన్ కావడం. వరద నీరు వెళ్లే మరో మార్గం లేకపోవడంతో నీరు అక్కడికి వచ్చి చేరుతుంది. భారీగా వచ్చిన వరద నీరు అక్కడే నిలుస్తుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారుల అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని వాహనదారులు తెలిపారు. ముందు ముందు కురిసే వర్షాలను దృష్టిలో పెట్టుకుని నీరు అక్కడ నిలవకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

తాచు పాము కలకలం ట్రాఫిక్ జామ్

రాంనగర్: లిబర్టీ చౌరస్తాలో శుక్రవారం సాయంత్రం ట్రాఫిక్ సిగ్నల్ వద్ద కేబుల్‌పై తాచుపాము కలకలం సృష్టించింది. వాహనదారులు భయాందోళనకు గురై వాహనాలను ఎక్కడికక్కడే నిలిపివేయడంతో ట్రాఫిక్ జామ్ అయింది. స్థానికులు, వాహనదారులు పామును సెల్ ఫోన్లలో వీడియో తీశారు. కొద్ది సేపటి తర్వాత కిందకు వచ్చి వెళ్లిపోయింది. దీంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు అక్కడికి చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రతిభా పురస్కారాలు

- సికింద్రాబాద్ రీజియన్‌లో 24 మంది ఎంపిక

ఏఎస్‌రావునగర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): టీజీఆర్టీసీ సికింద్రాబాద్ రీజియన్ పరిధిలోని పలు డిపోలలో విధులు నిర్వహిస్తూ ఉత్తమ పనితీరు కనబరిచిన 24 మంది ఉద్యోగులకు శుక్రవారం అధికారులు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. రీజియన్ పరిధిలోని 11 డిపోలకు చెందిన 24 మంది ఉద్యోగులను ఇందుకు ఎంపిక చేశారు. కుషాయిగూడ డిపో ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.వేంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరై వారికి పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి మూడు నెలలకు ఒకసారి విధి నిర్వహణలో ప్రతిభ కనబరచిన ఉద్యోగులను గుర్తించి వారిని మరింత ప్రోత్సహించడానికి సంస్థ ఈ విధమైన పురస్కారాలు అందజేస్తుందని తెలిపారు. ఉద్యోగులు మరింత బాధ్యతగా, ఓర్పుతో విధులు నిర్వహిస్తూ సంస్థ ఆర్థికాభివృద్ధికి పాటుపడాలని కోరారు. అనంతరం డిపో ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ హాలును ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ కుశ్రాఖాన్, డిప్యూటీ ఆర్‌ఎం బీంరెడ్డి, పలు డిపోల మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్‌లు తదితరులు పాల్గొన్నారు.


ప్రతిభా పురస్కాలు అందుకున్న ఆర్టీసీ ఉద్యోగులు

మృగశిర కార్తె.. కొనుగోలుదారులతో చేపల మార్కెట్ కిటకిట

- కిలో కొర్రమీను రూ. 500 నుంచి 550కి విక్రయం

ముషీరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మృగశిర కార్తె సందర్భంగా ముషీరాబాద్ చేపల మార్కెట్ కిటకిటలాడింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే అమ్మకాలు కొనసాగాయి. సాధారణ రోజులకంటే అధికంగా చేపలు దిగుమతి అయ్యాయి. బొచ్చె, రవ్వ చేపల ధరలను ప్రతిరోజు కన్నా రూ. 10 నుంచి 20 రూపాయలకు అధికంగా విక్రయించారు. కిలో చేపలు రూ. 120 నుంచి 130 పలికాయి. సాధారణ రోజుల్లో కిలో రూ. 400 నుంచి 450 రూపాయలు ఉండే కొర్రమీను మృగశిర కార్తె సందర్భంగా రూ. 500 నుంచి 550 రూపాయలకు విక్రయించారు. చేపలను శుభ్రం చేసి ముక్కలు చేసే వారికి సైతం మార్కెట్‌లో డిమాండ్ విపరీతంగా పెరిగింది. శనివారం చేప ప్రసాదం పంపిణీ చేస్తుండడంతో ప్రజలు పెద్దఎత్తున చేపలు కొనుగోలు చేసే అవకాశాలు ఉన్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. శుక్రవారం అమ్మకాలు కొంత తగ్గాయన్నారు.


చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

వర్షాకాలం ప్రమాదాలు-జాగ్రత్తలపై అవగాహన

- రేపు ఈవీడీఎం ఆధ్వర్యంలో శిక్షణ

హైదరాబాద్ సిటీ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు నగరంలో ప్రమాదాలు జరుగుతుంటాయి. తెరిచిన మ్యాన్‌హోళ్లు, క్యాచ్‌పిట్లలో పడడం.. విద్యుత్‌షాక్.. నాలాల్లో ప్రమాదవశాత్తు పడిపోవడం.. చెట్లు.. కొమ్మలు విరిగిపడడంతో కొన్నిసార్లు కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో వర్షం పడినప్పుడు జాగ్రత్తగా ఉండడం ఎలా..? ప్రమాదాల బారిన పడకుండా ఎలా కాపాడుకోవాలి..? అత్యవసర పరిస్థితుల్లో ఏం చేయాలి..? అన్న దానిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జీహెచ్‌ఎంసీ నిర్ణయించింది. ఇందులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్(ఈవీడీఎం) ఆధ్వర్యంలో బస్తీ వాసులు, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లలో పనిచేసే సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు.

ఈ నెల 9వ తేదీన ఫతుల్లగూడలోని ట్రైనింగ్ సెంటర్‌లో వర్షాకాలం ప్రమాదాలు-జాగ్రత్తలపై అవగాహన, సమాచారంపై విపత్తుల నిర్వహణ విభాగం శిక్షణ ఇవ్వనుంది. వర్షం పడినప్పుడు అత్యవసర పరిస్థితుల్లో ఎవరికి సమాచారం ఇవ్వాలి..? ఏం చేయాలి..? అన్న దానిపై అవగాహన కల్పించనున్నారు. బస్తీవాసులు, స్వచ్ఛంద సంస్థలు, ట్రేడ్ యూనియన్ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు కే శ్యాంసుందర్‌రెడ్డి (ఎస్‌ఎఫ్‌ఓ)ను 7981775687లో సంప్రదించాలని సూచించారు.

ప్రేమించి పెళ్లి చేసుకుని వేధింపులు

- డబ్బులు తీసుకుని మోసం చేశాడని ఫిర్యాదు

యూసుఫ్‌గూడ: ప్రేమించి పెళ్లి చేసుకుని ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని డబ్బులు తీసుకుని వేరే మహిళలతో ఫోన్ చేయించి వేధిస్తున్నాడని ఓ మహిళ మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కదులూరి కనకమహాలక్ష్మి, బిల్లాకుర్తి అప్పారెడ్డి ప్రేమించుకున్నారు. గతేడాది ఆగస్టులో వివాహం చేసుకుని మధురానగర్‌లో నివాసం ఉంటున్నారు. వివాహం అయిన నెల తర్వాత తనకు ఆర్థిక ఇబ్బందులు వచ్చాయని రూ.30లక్షలు కావాలని అప్పారెడ్డి కనకమహాలక్ష్మిని అడిగాడు. ఆమె స్నేహితులు, బంధువుల వద్ద అప్పు తీసుకుని, బంగారం తాకట్టు పెట్టి క్రెడిట్ కార్డు ఉపయోగించి మొత్తం రూ.15లక్షలు ఇచ్చింది. డబ్బులు తీసుకున్నాక ఆర్థిక ఇబ్బందులు పోవాలంటే చైనాకు వెళ్తానని చెప్పి 29-3-2024న వెళ్లాడు. అతడు వెళ్లిన రెండు రోజులకు మృదల బండారు అనే మహిళ ఫోన్ చేసి అప్పారెడ్డి తన భర్త అని, ఐదు సంవత్సరాల బాబు ఉన్నాడని చెప్పింది. వెంటనే అప్పారెడ్డికి ఫోన్ చేసి అడగగా అది అబద్ధం అని, ఆమె నంబర్ బ్లాక్ చేయమని చెప్పాడు. నెల రోజులకు శ్రీకర్ సీత అనే మహిళ ఫోన్ చేసి అప్పారెడ్డి మోసగాడని, అతడిని వదిలేయాలని బెదిరించింది. దీంతో ఈ మహిళలు అప్పారెడ్డితో ఉండి తనను మోసం చేస్తున్నారని, న్యాయం చేయాలని కనకమహాలక్ష్మి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాదిగలు పార్లమెంట్‌లో అడుగు పెట్టకూడదా: మోత్కుపల్లి

యూసుఫ్‌గూడ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విధానాలవల్ల మాదిగలకు అన్యాయం జరిగిందని, దీంతో కాంగ్రెస్ పార్టీకి తీవ్రనష్టం జరుగుతుందని, సీనియర్లమైన తమ వంటి వారి సలహాలు తీసుకోకుండా అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదని, ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్కసీటు కూడా మాదిగలకు ఇవ్వకుండా మాదిగలకు తీవ్ర అన్యాయం చేశారని సీనియర్ కాంగ్రెస్ నాయకులు మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 80లక్షల మంది మాదిగలు ఉంటే ఒక్క ఎంపీ సీటు కూడా ఇవ్వలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి మాట్లాడదామని పోతే 6గంటలు ఎదురు చూసినా కలవ లేదని, తన నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో ఇంత అవమానం ఎప్పుడూ జరగలేదని మోత్కుపల్లి నర్సింహులు ఆవేదన వ్యక్తం చేశారు.